




ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 145 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 + https:www.prajarepublic.com + వెల - 1/- | మంగళవారం 31 డిసెంబర్ 2024

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# లబ్ధిదారుల ఇంటికి వెళ్లి

## .. స్వయంగా కాఫీ కలిపిన చంద్రబాబు

పల్నాడు జిల్లా యల్లమందలో ఏపీ సీఎం చంద్రబాబు పర్యటించారు. లబ్దిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.



**పల్నాడు, డిసెంబర్ 31, (రిపబ్లిక్ న్యూస్):** పల్నాడు జిల్లా యల్లమందలో ఏపీ సీఎం చంద్రబాబు పర్యటించారు. లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా సీఎం వెళ్లి.. వారితో మాట్లాడారు. శారమ్మ అనే మహిళ ఇంటికి వెళ్లి పింఛన్ నగుదును చంద్రబాబు అందజేశారు. వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె కూమార్తెకు మంచి చదువు చెప్పించాలని అధికారులను ఆదేశించారు. నీట్ కోచింగ్ ఇప్పించాలని సూచించారు. శారమ్మ కుమారుడికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ. లక్ష రుణం ఇప్పించాలని సూచించారు.స్వయంగా కాఫీ కలిపిన చంద్రబాబు..మరో లబ్ధిదారుడు ఏడుకొండలు ఇంట్లోకి వెళ్లి సీఎం పలకరించారు. వారి ఇంట్లో స్వయంగా కాఫీ కలిపి ఏడుకొండలు కుటుంబ సభ్యులకు చంద్రబాబు అందించారు. వారి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

# సమష్టిగా ప్రయత్నించాం.. మార్పు సాధించాం

## .. ఈ ఏడాదిపై మోదీ పోస్టు

2024 ముగుస్తున్న సందర్భంగా ఈ ఏడాది భారత్ సాధించిన విజయాలను ఉద్దేశిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ పోస్ట్ చేశారు.



**డిసెంబర్ 31, (రిపబ్లిక్ న్యూస్):** మరికొన్ని గంటల్లో నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టనున్నాం. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలను ఉద్దేశిస్తూ.. పోస్టు పెట్టారు. ఈ ఏడాది భారత్ సాధించిన విజయాలను గురించి వివరిస్తూ ఓ వీడియోను షేర్ చేశారు.'సమష్టిగా ప్రయత్నించి.. 2024లో అనేక విజయాలు అందుకున్నాం. 2025లో మరింత కష్టపడి పనిచేసి వికసిత్ భారత్ కలను సాకారం చేసుకుందాం' అని మోదీ పేర్కొన్నారు. దీనితో పాటు ఈ ఏడాది భారత్ సాధించిన విజయాలకు సంబంధించిన వీడియోను ఆయన పంచుకున్నారు. ఈ వీడియో ఒక ఏడాది కాలంలో సాధించిన పురోగతి, ఐక్యత, వికసిత్ భారత్ వైపు వేసిన అడుగులను గుర్తుచేస్తుందన్నారు.

# ఫార్ములా-ఈ రేసు కేసు.. కేటీఆర్ క్వాష్ పిటిషన్ పై హైకోర్టులో విచారణ

ఫార్ములా-ఈ రేసు వ్యవహారంపై ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ మాజీ మంత్రి కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్పై హైకోర్టులో విచారణ జరిగింది.



**హైదరాబాద్, డిసెంబర్ 31, (రిపబ్లిక్ న్యూస్):** ఫార్ములా-ఈ రేసు వ్యవహారంపై ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ మాజీ మంత్రి కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్పై హైకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో ఆరోపణలు ఏంటని ప్రభుత్వం తరపు న్యాయవాదిని ఉన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. భారాస హయాంలో నిబంధనలకు విరుద్ధంగా డబ్బు చెల్లించారని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. అవినీతి నిరోధక చట్టం, నేరపూరిత కుట్ర సెక్షన్లు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ వ్యవహారంలో అవినీతి జరిగిందని బాధ్యతగల అధికారిగా దానకిశోర్ ఫిర్యాదు చేశారన్నారు. ప్రజాధనం దుర్వినియోగం చేసినందుకు కేటీఆర్పై కేసు నమోదు చేశారని వివరించారు. ఫార్ములా ఈ-రేసు ఆపరేషన్స్ సంస్థను ఎఫ్ఐఆర్లో చేర్చారా? ఈ వ్యవహారంలో ఎవరెవరి మధ్య ఒప్పందం జరిగింది? అని హైకోర్టు ప్రశ్నించింది.దీనిపై ప్రభుత్వం తరపు న్యాయవాది మళ్లీ వాదనలు వినిపించారు. "ఫార్ములా ఈ-రేసు ఆపరేషన్స్, పురపాలకశాఖ మధ్య ఒప్పందం కుదిరింది. పౌండ్ల రూపంలో రూ.46 కోట్లు చెల్లించినా ఆర్బీఐ నిబంధనలు పాటించలేదు. హెచ్ఎండీఏ నుంచి రూ.10 కోట్లకు మించి చెల్లిస్తే ఆర్థికశాఖ అనుమతి ఉండాలి. ఎవరి అనుమతి లేకుండానే రూ.54 కోట్లు చెల్లించారు. ఎన్నికల కోడ్ ఉండగానే రేసు నిర్వహణకు ఒప్పందం చేసుకున్నారు. డబ్బు చెల్లింపులో సెక్రటేరియట్ బిజినెస్ రూల్స్ పాటించలేదు. డబ్బు చెల్లింపు నోట్ ఫైల్లో మంత్రి హోదాలో కేటీఆర్ సంతకం చేశారు" అని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు.అనంతరం కేటీఆర్ తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే వాదనలు వినిపించారు. "ఏసీబీ అధికారులు నమోదు చేసిన సెక్షన్లు ఎఫ్ఐర్కు వర్తించవు. ఫార్ములా ఈ-రేసు నిర్వహణ ఒప్పందంలో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సంతకం చేశారు. ఆ శాఖకు మంత్రిగా ఉన్న కేటీఆర్ను ఎఫ్ఐఆర్ లో నిందితుడిగా చేర్చడం తగదు. కేటీఆర్ ఎక్కడా లబ్ధి పొందలేదు. అవినీతి జరిగినట్లు ఎక్కడా ఆధారాలు చూపించలేదు" అని కోర్టుకు తెలిపారు. ఈ సందర్భంగా పలు తీర్పులను ఆయన ప్రస్తావిస్తూ ఎఫ్ఐఆర్ కొట్టివేయాలని ఉన్నత న్యాయస్థానాన్ని కోరారు.

# అస్సాంలో కొడాలి నాని ప్రధాన అనుచరుడు అరెస్ట్!

మాజీ మంత్రి కొడాలి నాని ప్రధాన అనుచరుడు, కృష్ణా జిల్లా వైకాపా యువజన విభాగం అధ్యక్షుడు మెరుగుమాల కాళీని గుడివాడ పోలీసులు అరెస్ట్ చేసినట్లు సమాచారం.



**గుడివాడ, డిసెంబర్ 31, (రిపబ్లిక్ న్యూస్):** మాజీ మంత్రి కొడాలి నాని ప్రధాన అనుచరుడు, కృష్ణా జిల్లా వైకాపా యువజన విభాగం అధ్యక్షుడు మెరుగుమాల కాళీని గుడివాడ పోలీసులు అరెస్ట్ చేసినట్లు సమాచారం. వైకాపా హయాంలో గుడివాడ తెదేపా కార్యాలయం, ఆ పార్టీ నేత రావి వెంకటేశ్వరరావుపై దాడి కేసులో కాళీని కీలక సూత్రధారిగా పోలీసులు గుర్తించి అతడిపై కేసు నమోదు చేశారు. ఇప్పటికే ఈ కేసులో 13 మంది వైకాపా కార్యకర్తలు అరెస్టయి రిమాండ్లో ఉన్నారు. తాజాగా కాళీని అస్సాంలో గుడివాడ పోలీసు బృందాలు పట్టుకున్నాయి. వైకాపా హయాంలో గడ్డం గ్యాంగ్ ముసుగులో నిందితులు అరాచకాలకు పాల్పడ్డారు.వైకాపా అధికారంలో ఉండగా 2022 డిసెంబర్ 25న మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, తెదేపా కార్యాలయంపై పెట్రోల్ ప్యాకెట్లతో దాడులకు తెగబడ్డారు. ఈ విషయంపై నమోదైన కేసులో ఇప్పటికి వరకు 13 మంది కాళీ అనుచరులను ఇటీవల గుడివాడ వన్టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. ప్రధాన నిందితుడు కాళీ అప్పటి నుంచి పరారీలో ఉన్నాడు. అతడు ఈశాన్య రాష్ట్రమైన అస్సాం వెళ్లి అక్కడ చేపల వ్యాపారం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే కాళీ కదలికలపై నిఘా ఏర్పాటు చేసి మంగళవారం అరెస్ట్ చేసినట్లు తెలిసింది. దీన్ని పోలీసులు ధ్రువీకరించాల్సి ఉంది. త్వరలో నిందితుడిని గుడివాడ తీసుకొచ్చి కోర్టులో హాజరుపరిచే అవకాశముంది.మరోవైపు ఇదే కేసులో మాజీ మంత్రి కొడాలి నాని కూడా అరెస్ట్ అయ్యే అవకాశముంది. గతంలో అరెస్టయిన 13 మంది నిందితులను గుడివాడ వన్టౌన్ పోలీసులు కస్టడీకి తీసుకుని రెండురోజుల పాటు విచారించారు. ఈ క్రమంలో వారు కొడాలి నాని ఆదేశాల ప్రకారమే దాడులకు పాల్పడ్డామని వెల్లడించినట్లు సమాచారం. వారి మాటల్లో వాస్తవాలు ఉన్నట్లు రుజువైతే కొడాలి నానిని పోలీసులు అరెస్ట్ చేసే అవకాశముంది.

# ఐదు కోట్ల మంది ప్రజలే నాకు హైకమాండ్: చంద్రబాబు

ప్రజల కష్టాల్లో భాగం పంచుకోవడానికే తాను వచ్చానని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పనులు చేయించాలనేదే తన తపన అని పేర్కొన్నారు.



**యల్లమంద, డిసెంబర్ 31, (రిపబ్లిక్ న్యూస్):** ప్రజల కష్టాల్లో భాగం పంచుకోవడానికే తాను ఇక్కడికి వచ్చానని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పనులు చేయించాలనేదే తన తపన అని పేర్కొన్నారు. పల్నాడు జిల్లా యల్లమందలో చంద్రబాబు పర్యటించారు. లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా సీఎం వెళ్లి.. వారి కష్టాలను తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన గ్రామ సభలో చంద్రబాబు ప్రసంగించారు."గత ఐదేళ్లు ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితి. కనీసం నవ్వలేకపోయారు. ఇప్పుడు ఇంటింటికీ వచ్చి పింఛన్లు అందిస్తున్నాం. ఇంటి వద్ద కాకుండా ఆఫీస్లోలో ఇస్తే వెంటనే మెమో పంపిస్తా. ఫోన్లో జీపీఎస్ ద్వారా సమాచారం వస్తుంది. డ్రోన్లను కూడా సహాయ కార్యక్రమాల్లో వినియోగిస్తున్నాం. పేదవాళ్ల జీవితాల్లో వెలుగు చూడాలన్న ఏకైక లక్ష్యంతో పనిచేస్తున్నాం. ఐదు కోట్ల మంది ప్రజల కోసమే నేను కష్టపడుతున్నా. ఏ ఇంట్లో కష్టమొచ్చినా వాళ్ల ఇంట్లో నేనొక ప్రాణ స్నేహితుడిగా ఉండి వాళ్లను కాపాడుకుంటాను. నేను ఏం చేసినా అందరికీ న్యాయం జరగాలనేదే నా ఆలోచన. నాకు హైకమాండ్ ఎవరూ లేరు. ఐదు కోట్ల మంది ప్రజలే నాకు హైకమాండ్ " అని చంద్రబాబు అన్నారు.పార్టీ కోసం పనిచేసిన వారిని ఎప్పటికీ మరిచిపోలేమని చంద్రబాబు అన్నారు. 90 లక్షల మంది పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. పార్టీ సిద్ధాంతాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చెప్పాలని.. కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని చంద్రబాబు హామీ ఇచ్చారు.

# జనవరి 4న తెలంగాణ కేబినెట్ భేటీ

## .. రైతు భరోసా, రేషన్ కార్డులుపై చర్చ?

తెలంగాణరాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి అధ్యక్షతన జనవరి 4న సాయంత్రం 4గంటలకు సచివాలయంలో జరగనుంది.



**హైదరాబాద్, డిసెంబర్ 31, (రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణరాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి అధ్యక్షతన జనవరి 4న సాయంత్రం 4గంటలకు సచివాలయంలో జరగనుంది. రైతు భరోసా, భూమిలేని పేదలకు నగదు, కొత్త రేషన్ కార్డులు, టూరిజం పాలసీపై చర్చించే అవకాశముంది. సంక్రాంతి తర్వాత రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ చేస్తామని ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో రైతు భరోసాపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశముంది.కొత్త రేషన్ కార్డులకు ఆదాయ పరిమితి, దరఖాస్తుల స్వీకరణపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం లబ్దిదారులకు సబ్సిడీ రేట్లతో ఇసుక, సిమెంట్, స్టీల్ సరఫరా చేయాలన్న ప్రతిపాదనపై కేబినెట్ చర్చించనున్నట్లు సమాచారం. విద్యుత్ కమిషన్, బీసీ డెడికేటెడ్ కమిషన్, ఎస్సీ వర్గీకరణ కమిషన్ నివేదికలపై చర్చించే అవకాశం ఉంది. యాదగిరిగుట్ట దేవాలయానికి తితిదే తరహాలో ప్రత్యేక బోర్డు ఏర్పాటుపై మంత్రిమండలి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. యాదగిరిగుట్ట ఆలయానికి 20 మందితో పాలక మండలి ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. నూతన టూరిజం పాలసీపై కేబినెట్ ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది. కొత్త టూరిజం పాలసీపై ఇటీవల అసెంబ్లీలోనూ చర్చించారు.

# వర్సిటీలో విద్యార్థినిపై దారుణం

## .. మదురై నుంచి చెన్నైకి భాజపా నిరసన ర్యాలీ

అన్నా వర్సిటీలో విద్యార్థినిపై అత్యాచార ఘటనకు వ్యతిరేకంగా భాజపా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తోంది.



**చెన్నై ,డిసెంబర్ 31, (రిపబ్లిక్ న్యూస్):** అన్నా వర్సిటీలో విద్యార్థినిపై అత్యాచార ఘటనకు వ్యతిరేకంగా భాజపా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తోంది. బాధితురాలికి న్యాయం చేసేందుకు పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో భారీ ర్యాలీకి పిలుపునిచ్చింది. మదురై నుంచి చెన్నై వరకు దాదాపు 450కి.మీల మేర ర్యాలీ చేపట్టనున్నట్లు భాజపా తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు కె. అన్నామలై వెల్లడించారు. ఈ కేసులో నిందితులు డీఎంకేకు చెందినవారని, అందుకే ఈ విషయాన్ని దాచిపెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.మహిళలపై అకృత్యాలను నిరసిస్తూ భాజపా మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు ఉమరాతి రాజన్ ఆధ్వర్యంలో ఈ న్యాయ ర్యాలీ ( జనవరి 3న ప్రారంభం కానుంది. ఈ ర్యాలీ చెన్నైకి చేరుకున్న అనంతరం మహిళా విభాగం తమ డిమాండ్లపై గవర్నర్కు వినతిపత్రం అందజేయనుందని అన్నామలై తెలిపారు. అన్నావర్సిటీలోని క్యాంపస్లో ఇటీవల 19 ఏళ్ల విద్యార్థిపై లైంగిక దాడి ఘటన రాజకీయ ప్రకంపనలు రేపుతోంది. ఈ దారుణంపై విపక్షాలతో పాటు పౌర సమాజం నుంచి నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంలో ఒకరిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో నిందితుడు అధికార డీఎంకేకు చెందిన వ్యక్తి అంటూ పలువురు చేస్తున్న ఆరోపణల్ని ఆ పార్టీ ఖండించింది.మరోవైపు, తమిళనాడులో డీఎంకే ప్రభుత్వం మహిళలకు భద్రత కల్పించడం లేదని అన్నామలై ఆరోపిస్తున్నారు. అన్నా విశ్వవిద్యాలయంలో విద్యార్థినిపై అత్యాచార ఘటనకు వ్యతిరేకంగా ఇటీవల ఆయన కోవైలో తన ఇంటి ఎదుట కొరడా (జాటి)తో కొట్టుకుంటూ నిరసన తెలిపిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్గా మారిన విషయం తెలిసిందే. డీఎంకే ప్రభుత్వాన్ని గద్దె దింపే వరకూ పాదరక్షలు ధరించబోనంటూ ఆయన శపథం చేశారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# మాజీ మంత్రి పేర్ని నానిపై కేసు నమోదు

**రేషన్ బియ్యం మాయం వ్యవహారంలో వైకాపా నేత, మాజీ మంత్రి పేర్ని నాని పై కేసు నమోదైంది.**



మచిలీపట్నం, డిసెంబర్ 31, (రిపబ్లిక్ న్యూస్): రేషన్ బియ్యం మాయం వ్యవహారంలో వైకాపా నేత, మాజీ మంత్రి పేర్ని నాని పై కేసు నమోదైంది. ఆయన్ను ఏ6గా చేరుస్తూ మచిలీపట్నం తాలూకా పీఎస్లో పోలీసులు కేసు నమోదు చేశారు.మరోవైపు రేషన్ బియ్యం మాయం కేసులో ఇప్పటికే నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారికి మచిలీపట్నంలోని స్పెషల్ మొబైల్ జడ్జి 12 రోజుల రిమాండ్ విధించారు. దీంతో నిందితులను మచిలీపట్నం సబ్ జైలుకు తరలించారు. ఈ కేసులో పేర్ని నాని సతీమణి జయసుధ ఏ1గా పోలీసులు పేర్కొన్నారు. ఆమెకు న్యాయస్థానం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఇప్పటి అరెస్టయిన నలుగురు నిందితుల్లో గోదాము మేనేజర్ మానస్ తేజ, పౌరసరఫరాల శాఖ అసిస్టెంట్ మేనేజర్ కోటిరెడ్డి, రైస్ మిల్లు యజమాని బొర్రా ఆంజనేయులు, లారీ డ్రైవర్ బోట్ల మంగరాజు ఉన్నారు.వైకాపా హయాంలో జయసుధ పేరిట గోదామును పేర్ని నాని నిర్మించారు. దాన్ని పౌరసరఫరాల శాఖకు అద్దెకు ఇచ్చారు. ఇటీవల ఆ గిడ్డంగిని అధికారులు తనిఖీ చేశారు. ఈ క్రమంలో బియ్యం నిల్వల్లో వ్యత్యాసాన్ని గుర్తించారు. పెద్ద ఎత్తున పీడీఎస్ బియ్యం మాయమైనట్లు తేల్చారు. గోదాము మేనేజర్ మానస్ తేజ, పౌరసరఫరాల అధికారి కోటిరెడ్డి మిగిలిన ఇద్దరి బ్యాంకు ఖాతాల లావాదేవీల్లో సుమారు రూ.25 లక్షల నుంచి రూ.30లక్షల మేర లావాదేవీలు జరిగాయని పోలీసులు గుర్తించినట్లు సమాచారం. వీటి ఆధారంగానే మిగిలిన నిందితులను గుర్తించినట్లు తెలుస్తోంది. మరోవైపు పేర్ని నాని కుటుంబంలోని పలువురి ఖాతాలకు కూడా మానస్ తేజ ఖాతా నుంచి డబ్బు (రూ. లక్షల్లో) లావాదేవీలు జరిగాయని ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి..

# భవిష్యత్తులో జ్యోతిష శాస్త్ర విశ్లేషణలకు 'శంకరమంచి' పరిశోధనలు స్ఫూర్తి



**కర్ణాటకలోని శృంగేరి శారదా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విదుశేఖర భారతీ మహాస్వామి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు.**



డిసెంబర్ 31, (రిపబ్లిక్ న్యూస్): కర్ణాటకలోని శృంగేరి శారదా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ మహాస్వామి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా విశేష జ్యోతిష పరిశోధనల సారాంశాన్ని స్వామి వారికి శృంగేరి ఆస్థాన జ్యోతిష విద్వాంసులు శంకరమంచి రామకృష్ణ శాస్త్రి సమర్పించారు. శంకరమంచి పరిశోధనలపై విధుశేఖర భారతీ స్వామి ప్రశంసించి పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ పరిశోధనలు భవిష్యత్తులో ఆధ్యాత్మిక, జ్యోతిష శాస్త్ర విశ్లేషణలకూ స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు.ఈ సందర్భంగా శంకరమంచి రామకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ శ్రద్ధతో, కష్టపడి చేసిన ఏ కృషికైనా దైవానుగ్రహం అవసరమన్నారు. జగద్గురువుల ఆశీస్సులతో పరిశోధనలు మరింత ఉన్నత స్థాయికి అధిరోహిస్తాయని విశ్వసిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం భక్తులందరికీ ఆధ్యాత్మిక ప్రేరణతో పాటు భవిష్యత్తు సాధనకు ఒక దిశానిర్దేశంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో దర్శనం శర్మ, కాసుల రాధాకృష్ణ శర్మ, శాస్త్రుల వెంకటేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.

# దుకాణంలోకి దూసుకుపోయిన లారీ .. ఒకరు మృతి

**దుకాణంలో ఇసుక లారీ దూసుకుపోయి ఒకరు మృతి చెందిన ఘటన సుందరయ్య నగర్ బస్టాండ్ వద్ద చోటుచేసుకుంది..**



గాజువాక,డిసెంబర్ 31, (రిపబ్లిక్ న్యూస్): దుకాణంలో ఇసుక లారీ దూసుకుపోయి ఒకరు మృతి చెందిన ఘటన సుందరయ్య నగర్ బస్టాండ్ వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇసుక లారీ బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో అదుపు తప్పి కిరాణా దుకాణంలోనికి దూసుకుపోయింది. అప్పుడే అక్కడికి జిరాక్స్ కోసం వచ్చిన రమణ(45) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇల్లు కొంతభాగం ధ్వంసం అయింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఖాజాగూడ చెరువులో హైడ్రా కూల్చివేతలు

**ఖాజాగూడ భగీరథమ్మ చెరువులో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. చెరువు బఫర్ జోన్లోని నిర్మాణాలను కూల్చివేశారు.**



హైదరాబాద్, డిసెంబర్ 31, (రిపబ్లిక్ న్యూస్): ఖాజాగూడ భగీరథమ్మ చెరువులో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. చెరువు బఫర్ జోన్లోని నిర్మాణాలను కూల్చివేశారు. ఇటీవల ఈ చెరువును హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. కూల్చివేతల సందర్భంగా భారీ బందోబస్తు చేపట్టారు.

# రేషన్ బియ్యం మాయం కేసులో నిందితులకు రిమాండ్

**రేషన్ బియ్యం మాయం కేసులో నిందితులకు మచిలీపట్నంలోని స్పెషల్ మొబైల్ జడ్జి 12 రోజుల రిమాండ్ విధించారు.**



మచిలీపట్నం, డిసెంబర్ 31, (రిపబ్లిక్ న్యూస్): రేషన్ బియ్యం మాయం కేసులో నిందితులకు మచిలీపట్నంలోని స్పెషల్ మొబైల్ జడ్జి 12 రోజుల రిమాండ్ విధించారు. మచిలీపట్నం సబ్జైలుకు నిందితులను తరలించారు. ఈ కేసులో నిందితులుగా గోదాము మేనేజర్ మానస్ తేజ, పౌరసరఫరాల శాఖ అసిస్టెంట్ మేనేజర్ కోటిరెడ్డి, రైస్ మిల్లు యజమాని బొర్రా ఆంజనేయులు, లారీ డ్రైవర్ మంగరాజు ఉన్నారు. వీరిని రాత్రి 11 గంటలకు న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. ఈ కేసులో ఏ1గా ఉన్న పేర్ని జయసుధకు ఇప్పటికే ముందస్తు బెయిల్ లభించిన విషయం తెలిసిందే.

# తీర్పు ఇచ్చే వరకు కేటీఆర్ను అరెస్ట్ చేయొద్దు: హైకోర్టు

**ఫార్ములా-ఈ రేసు వ్యవహారంపై ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ మాజీ మంత్రి కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్పై హైకోర్టులో విచారణ ముగిసింది.**



హైదరాబాద్,డిసెంబర్ 31, (రిపబ్లిక్ న్యూస్): ఫార్ములా-ఈ రేసు వ్యవహారం పై ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ మాజీ మంత్రి కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్పై హైకోర్టులో విచారణ ముగిసింది. తీర్పు ఇచ్చే వరకు కేటీఆర్ను అరెస్టు చేయొద్దని ఆదేశిస్తూ.. మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు పొడిగించింది.

# తూ.గో జిల్లాలో రేవ్ పార్టీ .. ప.గో జిల్లా వ్యక్తులే కీలకం!

**తూర్పు గోదావరి జిల్లా కోరుకొండలో రేవ్ పార్టీ తరహాలో వేడుకలు కలకలం రేపాయి..**



ఏలూరు, డిసెంబర్ 31, (రిపబ్లిక్ న్యూస్): తూర్పు గోదావరి జిల్లా కోరుకొండలో రేవ్పార్టీ తరహాలో వేడుకలు కలకలం రేపాయి.పోలీసులు పక్కా సమాచారంతో దాడి చేసి, పలువురిని అదుపులోకి తీసుకున్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడి గేటు సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్పై సోమవారం తెల్లవారుజామున ప్రత్యేక, స్థానిక పోలీసు సిబ్బంది సంయుక్తంగా దాడి చేశారు. ఆ సమయంలో పలువురు పురుషులు మద్యం తాగుతుండగా, మహిళలు నృత్యం చేస్తూ కనిపించారు. అందరినీ అదుపులోకి తీసుకున్నారు. ఫంక్షన్ హాల్ నిర్వాహకులు సత్తి బామిరెడ్డి, సత్తి రామిరెడ్డి, గుంటూరుకు చెందిన ఫెర్టిలైజర్స్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ రంగేటి గోపాలకృష్ణ సహా మొత్తం 19 మందిని అరెస్టు చేశారు. కాకినాడకు చెందిన ముగ్గురు, రాజమహేంద్రవరం ప్రాంతానికి చెందిన మరో ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకుని ప్రత్యేక హోమ్కు తరలించారు.ఈ రేవ్ పార్టీలో పశ్చిమ గోదావరి జిల్లా వ్యక్తులే కీలకంగా ఉన్నట్లు సమాచారం. గోపాలకృష్ణ అనే వ్యక్తి రూ.18 వేలకు ఫంక్షన్ హాల్ బుక్ చేసి పార్టీ నిర్వహించినట్లు తెలుస్తోంది. పశ్చిమగోదావరి జిల్లా తణుకు, ఆచంట, గోపాలపురానికి చెందిన 10 మంది ఎరువుల డీలర్లను గోపాలకృష్ణ రప్పించాడు. కాకినాడకు చెందిన మహిళద్వారా వచ్చిన ఐదుగురు అమ్మాయిలుతో మద్యం తాగుతూ డ్యాన్సు చేశారు. ఈ కేసులో ఫంక్షన్ హాల్ యజమాని కుమారుడు సహా 10 మంది .

# రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలనిగ్రామస్థుల ఆందోళన

**విశాఖపట్నం పద్మనాభం మండలం రెడ్డిపల్లి గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని గ్రామస్థులు మంగళవారం ఉదయం ఆందోళనకు దిగారు.**



పద్మనాభం,డిసెంబర్ 31, (రిపబ్లిక్ న్యూస్): పద్మనాభం మండలం రెడ్డిపల్లి గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని గ్రామస్థులు మంగళవారం ఉదయం ఆందోళనకు దిగారు. పద్మనాభం నుంచి రెడ్డిపల్లి వరకు మూడున్నర కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులకు గత వైసీపీ ప్రభుత్వం పది కోట్లు కేటాయించింది. కానీ నేటికీ పూర్తి కాలేదు. గత రెండు మూడు సంవత్సరాలుగా ఈ రోడ్డుపై రాకపోకలు సాగించడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన పనులు పూర్తి చేయాలని గ్రామస్థులు ఆందోళనకు దిగారు. దీంతో ఉద్యోగులు విధులకు వెళ్లే సమయం విద్యార్థులు పాఠశాలలో, కళాశాలకు వెళ్లే సమయం కావడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు వచ్చి చెప్పినా గ్రామస్థులు ఆందోళన విరమించలేదు. జిల్లా అధికారులు వచ్చి తమ సమస్య పరిష్కరించాలని రోడ్డుపై కూర్చున్నారు.

# ఏపీలో పలువురు ఐఏఎస్ అధికారులకు పదోన్నతి

**సీనియర్ ఐఏఎస్ అధికారులు సురేష్కుమార్, సాల్మన్ ఆరోక్యరాజ్లకు పదోన్నతి కల్పిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.**




అమరావతి, డిసెంబర్ 31, (రిపబ్లిక్ న్యూస్): సీనియర్ ఐఏఎస్ అధికారులు సురేష్కుమార్, సాల్మన్ ఆరోక్యరాజ్లకు పదోన్నతి కల్పిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2000 బ్యాచ్కి చెందిన ఈ ఇద్దరు అధికారులకు ముఖ్య కార్యదర్శి హోదా కల్పిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన శాఖ ముఖ్యకార్యదర్శిగా సురేష్ కుమార్ను రీడిజిగ్నేట్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. సాల్మన్ ఆరోక్యరాజ్ ప్రస్తుతం డిప్యుటేషన్పై కేంద్రంలో విధులు నిర్వహిస్తున్నారు.2009 బ్యాచ్కు చెందిన ఐఏఎస్ అధికారులు కార్తికేయ మిశ్రా, వీరపాండ్యన్, సీహెచ్ శ్రీధర్లకు కార్యదర్శి హోదా కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం సీఎంవోలో సహాయ కార్యదర్శిగా ఉన్న కార్తికేయ మిశ్రాకు అక్కడే సీఎంవో కార్యదర్శిగా పదోన్నతి కల్పించారు. వీరపాండ్యన్ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సీఈవోగా కొనసాగనున్నారు. కడప జిల్లా కలెక్టర్గానే శ్రీధర్ను కొనసాగిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. ఐపీఎస్ అధికారులు విక్రాంత్ పాటిల్, సిద్ధార్థ్ కౌశల్కు పదోన్నతి కల్పించారు.

# పింఛన్లు అందజేస్తున్న మంత్రి నారాయణ

**నెల్లూరు గుర్రాల మడుగు సంఘం ప్రాంతంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో మంత్రి నారాయణ పాల్గొన్నారు.**



నెల్లూరు, డిసెంబర్ 31, (రిపబ్లిక్ న్యూస్): నెల్లూరు గుర్రాల మడుగు సంఘం ప్రాంతంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో మంత్రి నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్న పరిస్థితులను ఒక్కొక్కటిగా చక్కదిద్దుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంను ప్రజలకు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నుడా ఛైర్మన్ శ్రీనివాసులు రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్ల పంపిణీలో సచివాలయ మహిళా పోలీసు చేతివాటం

**పింఛన్ల పంపిణీలో సచివాలయ మహిళా పోలీసు చేతివాటం చూపించారు. ఈ ఘటన వైఎస్ఆర్ జిల్లా జమ్మలమడుగులో చోటు చేసుకుంది.**



జమ్మలమడుగు, డిసెంబర్ 31, (రిపబ్లిక్ న్యూస్): పింఛన్ల పంపిణీలో సచివాలయ మహిళా పోలీసు చేతివాటం చూపించారు. ఈ ఘటన వైఎస్ఆర్ జిల్లా జమ్మలమడుగులో చోటు చేసుకుంది. వృద్ధాప్య పింఛనుకు రూ.300, వికలాంగ పింఛనుకు రూ.600 చొప్పున మహిళా పోలీసు వసూలు చేశారు. లంచం ఇవ్వకపోతే వచ్చే నెల నుంచి పింఛను తీసివేస్తారని హెచ్చరించారు. అడిగిన డబ్బు ఇవ్వలేక బాధితులు లబోదిబోమంటున్నారు.

# ఈ ఏడాదికి బెస్ట్ సినిమా
# .. 'అమరన్'పై జాన్వీ కపూర్ రివ్యూ..

**ఈ ఏడాదిని 'అమరన్' సినిమాతో ముగించినట్లు నటి జాన్వీకపూర్ అన్నారు. దీనిపై ప్రశంసలు కురిపించారు.**



శివకార్తికేయన్, సాయి పల్లవి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'అమరన్'. ఈ ఏడాది దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా విజయాన్ని సాధించింది. 2014లో జమ్ముకశ్మీర్ లో ఉగ్రవాదులతో పోరాటం చేస్తూ అసువులు బాసిన వీరుడు మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవిత కథతో రూపొందిన ఈ చిత్రంపై ఇప్పటికే ఎంతోమంది స్టార్స్ ప్రశంసలు కురిపించారు. తాజాగా నటి జాన్వీకపూర్ ఈ చిత్రంపై రివ్యూ ఇచ్చారు. ఈ ఏడాదికి 'అమరన్' బెస్ట్ చిత్రమని పేర్కొన్నారు. "ఈ సినిమా చూడటం కొంచెం ఆలస్యమైంది. ఈ చిత్రంలో ప్రతీ సన్నివేశం భావోద్వేగంతో నిండిఉంది. ఒక మంచి సినిమాతో ఈ ఏడాదిని ముగించాను. 'అమరన్' నా హృదయాన్ని కదిలించింది. ఇందులోని ఎమోషన్స్ నా హృదయాన్ని బరువెక్కించాయి" అని రాసుకొచ్చారు.అక్టోబర్ 31న పలు భాషల్లో 'అమరన్' ప్రేక్షకుల ముందుకువచ్చింది. 'ఇండియాస్ మోస్ట్' అనే పుస్తకంలోని మేజర్ వరదరాజన్ కథ ఆధారంగా ఇది రూపొందింది. వరదరాజన్గా శివ కార్తికేయన్ నటించగా, భార్య ఇందు రెబెకా జాన్ వర్గీస్ పాత్రలో సాయిపల్లవి నటించారు. తమిళంలో సోనీ పిక్చర్స్తో కలిసి కమల్హాసన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ముకుంద్, ఇందు మధ్య సన్నివేశాలు హృద్యంగా తెరకెక్కించారు. వ్యక్తిగత జీవితమే కాకుండా, మరోవైపు వృత్తి జీవితాన్నీ అంతే సహజంగా తెరపై ఆవిష్కరించారు. హృద్యమైన ఓ ప్రేమకథతో పాటు, దేశభక్తిని రగిలించే సైనికుడి స్ఫూర్తిదాయకమైన ప్రయాణాన్ని పరిపూర్ణంగా ఆవిష్కరించిన ఈ సినిమాపై సినీ, రాజకీయ ప్రముఖులు ప్రశంసలు కురిపించారు. ప్రస్తుతం ఈ చిత్రం నెటిక్స్ వేదికగా ప్రసారమవుతోంది. తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ఇది అందుబాటులో ఉంది.



# నటీనటుల ఏజ్ గ్యాప్
# .. మోహన్లాల్ ఆసక్తికర కామెంట్స్

**నటీనటుల మధ్య ఏజ్ గ్యాప్ అంశం ఎన్నో రోజులుగా ఇండస్ట్రీలో ఉందని మోహన్లాల్ అన్నారు. నటనకు వయసుతో సంబంధం లేదన్నారు.**

నాలుగు దశాబ్దాల నుంచి తన నటనతో ప్రేక్షకులను అలరిస్తున్నారు అగ్ర కథానాయకుడు మోహన్లాల్ తాజాగా 'బరోజ్ త్రీడీ'తో దర్శకత్వంలోనూ తన ప్రతిభను చూపారు. ఈ టాలెంటెడ్ నటుడు ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ.. సినిమాలో నటీనటుల మధ్య ఏజ్ గ్యాప్పై తన అభిప్రాయాన్ని వెల్లడించారు."ఒక కథకు ఎవరు సరిపోతారనేది నటుల వయసు కంటే వారి నటన ఆధారంగా ఎంచుకుంటారు. హీరోహీరోయిన్స్ మధ్య ఏజ్గ్యాప్ ఎక్కువగా ఉండడం ఇప్పటి విషయం కాదు. అది ఎప్పటినుంచో ఇండస్ట్రీలో అలాగే ఉంది. తమిళ, తెలుగు.. ఇలా ఏ భాషలోనైనా ఇది సహజం. నటనకు వయసుతో సంబంధం లేదు. ఆరోగ్యంగా ఉంటే 100 ఏళ్ల వయసులోను నటించొచ్చు. ఎలాంటి పాత్రలు ఎంచుకుంటున్నామనేది మన చేతిలోనే ఉంటుంది. అసౌకర్యంగా అనిపించే అవకాశాలను తిరస్కరించడంలో తప్పు లేదు' అని చెప్పారు. ఇక తాను ఏ విషయంలోనూ ముందస్తు ప్రణాళికలు వేసుకోనని అన్నారు.బరోజ్ త్రీడీ సినిమా మిశ్రమ స్పందనలకు పరిమితం కావడం గురించి మోహన్లాల్ మాట్లాడుతూ.. అన్ని సినిమాలు కేవలం డబ్బు కోసమే తీయరని స్పష్టం చేశారు. "ఇందులోఎంతోమంది గొప్ప నటీనటులు, సాంకేతిక నిపుణులు పనిచేశారు. ఇదొక విభిన్న ప్రయత్నం.ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించాం. మేము త్రీడీలో మాత్రమే విడుదల చేశాం. 2డీ కూడావిడుదల చేయాలని ఎంతోమంది కోరారు. ప్రజలకు సినిమాటిక్ అనుభూతి ఇవ్వాలంటే కొన్నిసినిమాలను త్రీడీలోనే విడుదల చేయాలి. దీన్ని డబ్బు కోసం తీయలేదు. 47 సంవత్సరాల నుంచిప్రేక్షకులు నాకు అందించిన ప్రేమకు బహుమతిగా దీన్ని రూపొందించా. ఇది వారికి నేను ఇచ్చినకానుక. పిల్లల కోసం తెరకెక్కించాను. కుటుంబసమేతంగా వచ్చి ఆదరిస్తున్నారు" అని తెలిపారు.ప్రస్తుతం మోహన్ లాల్ 'తుడరమ్'లో నటిస్తున్నారు. ఒందులో ఆయనకు జోడిగా శోభనకనిపించనున్నారు. తరుణ మూర్తి దర్శకత్వంలో ఇది రానుంది. గ్రామీణ నేపథ్యంలోరూపొందుతున్న చిత్రంలో మోహన్లాల్ టాక్సీ డ్రైవర్గా నటిస్తున్నారు. 1987 తర్వాత వీరిద్దరూకలిసి నటిస్తున్న సినిమా కావడంతో దీనిపై అంచనాలు నెలకొన్నాయి.

రిపబ్లిక్ సినిమా CINEMA

# మీ కంటే నేనే మంచివాడిని
## .. 'డాకు మహారాజ్ టీమ్ తో బాలయ్య హంగామా

**అన్స్టాపబుల్ కార్యక్రమంలో 'డాకు మహారాజ్' టీమ్ సందడి చేసింది. ఆ ఎపిసోడ్ కు సంబంధించిన ప్రోమో తాజాగా విడుదలైంది**




'డాకు మహారాజ్ టీమ్తో కలిసి బాలకృష్ణ అన్స్టాపబుల్ లో హంగామా చేశారు. దర్శకుడు బాబీ, మ్యూజిక్ డైరెక్టర్ తమన్, నిర్మాత నాగవంశీలను బాలకృష్ణ అడిగిన ప్రశ్నలకు స్టేజ్ అంతా నవ్వులమయమైంది. ఈ ఎపిసోడ్కు సంబంధించిన ప్రోమో తాజాగా విడుదలైంది. ఈ పూర్తి ఎపిసోడ్ జనవరి 3న ప్రసారం కానుంది. 'మీ ముగ్గురితో పోలిస్తే నేనే మంచి వాడిని' బాలయ్య అనగా.. రష్మిక పెళ్లి గురించి నాగవంశీ ఓ ఆసక్తికర విషయం పంచుకున్నారు. ఇలాంటి ఎన్నో సరదా సంభాషణలతో ఉన్న ఆ ప్రోమోను మీరూ చూసేయండి..

ఈ వీడియో చూశారా:


'బాలయ్యతో రామ్ చరణ్ సందడి.. 'అన్స్టాపబుల్ సెట్స్లో 'గేమ్ ఛేంజర్' టీమ్

## చరిత్రలో నేటి ప్రత్యేకత


- 1600: ఈస్ట్ ఇండియా కంపెనీ స్థాపించబడింది.
- 1738: బ్రిటిష్ ఇండియా గవర్నరు జనరల్ కారన్ వాలీసు జననం (మ.1805)
- 1926: భారతీయ సముద్ర-జీవశాస్త్ర శాస్త్రవేత్త ఎస్.జడ్. ఖాసిమ్ జననం (మ.2015).
- 1928: కళావాచస్పతి, ప్రముఖ తెలుగు సినిమా నటుడు, రచయిత, పాత్రికేయుడు కొంగర జగ్గయ్య జననం.(మ.2004)
- 1953: విప్లవ ప్రధానమైన సినిమాల నిర్మాత, నటుడు, హేతువాది ఆర్.నారాయణమూర్తి జననం.
- 1964: వెస్టిండీస్ కు చెందిన మాజీ క్రికెట్ క్రీడాకారుడు విన్స్టన్ బెంజిమన్ జననం.
- 1965: భారత మాజీ క్రికెట్ క్రీడాకారుడు లక్ష్మణ్ శివరామకృష్ణన్ జననం.
- 1984: ప్రముఖ భారతీయ సినిమా నటి, జంతుబలుల ఉద్యమకారిణి కవితా రాధేష్యం జననం. (చిత్రంలో)



ఈస్ట్ ఇండియా కంపెనీ



కారన్ వాలీసు




ఎస్.జడ్. ఖాసిమ్




కొంగర జగ్గయ్య



ఆర్.నారాయణమూర్తి



విన్స్టన్ బెంజిమన్



రాధేష్యం

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

# క్రికెట్ ఆస్ట్రేలియా టెస్ట్ టీమ్ ఆఫ్ ది ఇయర్.. కెప్టెన్ గా బుమ్రా ..!


**టీమ్ ఇండియా పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు అరుదైన గౌరవం లభించింది. క్రికెట్ ఆస్ట్రేలియా ప్రకటించే వార్షిక జట్టుకు కెప్టెన్ గా ఎంపికయ్యాడు.**



టీమ్ ఇండియా సూపర్ స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రాకు ఆసీస్లో అరుదైన గౌరవం లభించింది. క్రికెట్ ఆస్ట్రేలియా ఏటా ప్రకటించే టీమ్ ఆఫ్ ఇయర్కు ఈ సారి కెప్టెన్గా మన జస్సీ పేరును ఎంపిక చేసింది. ఈ ఏడాది అన్ని ఫార్మాట్లలో అతడు దుమ్ము రేపిన సంగతి తెలిసిందే. ఈ జట్టులో టీమ్ ఇండియా యువ బ్యాటర్ యశస్వీ జైస్వాల్కు కూడా చోటు దక్కడం విశేషం.బుమ్రా మొత్తంగా ఈ ఏడాది 84 వికెట్లు తీసుకొన్నాడు. అతడి తర్వాత రెండో స్థానంలో ఉన్న హసరంగ కేవలం 64 వికెట్లు పడగొట్టాడు. ఇద్దరి మధ్య 22 వికెట్ల తేడా ఉండటమే బుమ్రా సత్తాను తెలియజేస్తోంది.టీమ్ ఇండియా 11 ఏళ్ల తర్వాత ఐసీసీ ట్రోఫీ సాధించడానికి ప్రధాన కారణం కూడా బుమ్రానే. టీ20 ప్రపంచకప్లో కీలకమైన స్లాగ్ ఓవర్లను కట్టుదిట్టంగా వేసి వికెట్లు పడగొట్టాడు. అంతేకాదు.. బోర్డర్ గావాస్కర్ ట్రోఫీలో కూడా తొలి మ్యాచ్లో జట్టుకు పెర్త్ వికెట్పై ఏకంగా 295 పరుగుల భారీ విజయాన్ని అందించాడు. సిరీస్ మొత్తంలో ఇప్పటి వరకు 30 వికెట్లను పడగొట్టాడు. మరోవైపు ఆసీస్ సారథి కమిన్స్ మాత్రం కేవలం 20 వికెట్లనే తీసుకొన్నాడు.మరోవైపు 2024 సీజన్లో జైస్వాల్ బ్యాటింగ్లో అదరగొట్టాడు. మొత్తం 15 మ్యాచ్లు ఆడి 1478 పరుగులు సాధించాడు. వీటిల్లో అత్యధికంగా 214 పరుగులు ఒక ఇన్నింగ్స్ చేశాడు. మూడు శతకాలు, 9 అర్ధశతకాలతో టాప్ స్కోరర్ ఇంగ్లాండ్కు చెందిన జో రూట్ తర్వాతి స్థానంలో ఉన్నాడు.జైస్వాల్ (భారత్) బెన్ డకెట్, జోరూట్ (ఇంగ్లాండ్), రచిన్ రవిచంద్ర (న్యూజిలాండ్) హారీ బ్రూక్ (ఇంగ్లాండ్) కమింద్ మెండిస్ (శ్రీలంక) అలెక్స్ కేరీ (ఆస్ట్రేలియా) మాట్ హెన్రీ (న్యూజిలాండ్) బుమ్రా(కెప్టెన్) (భారత్), హేజిల్వుడ్ (ఆస్ట్రేలియా), కేశవ్ మహరాజ్ (దక్షిణాఫ్రికా)


## ఇంటి చిట్కాలు

# రోజూ రాత్రి ఇలా చేస్తే పేగులు క్లీన్ అవుతాయి
## .. ఉదయాన్నే పొట్టలోని మురికి అంతా బయటకు వచ్చేస్తుంది..



ఆరోగ్యకరమైన కడుపు, జీర్ణవ్యవస్థ సక్రమంగా ఉండటం కోసం సరైన ఆహారం, జీవనశైలిని అనుసరించడం ఈ రోజుల్లో చాలా ముఖ్యం. నేటి బిజీ లైఫ్స్టైల్లో చాలా మంది మలబద్ధకం, కడుపు ఉబ్బరం, అజీర్తి, గ్యాస్, ఎసిడిటీ వంటి జీర్ణ సమస్యలతో పోరాడుతున్నారు. మన శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే.. జీర్ణవ్యవస్థ సజావుగా పనిచేయడం చాలా ముఖ్యం అంటున్నారు నిపుణులు. ఆరోగ్యంగా ఉండాలంటే గట్ హెల్త్ ఎంతో కీలకం. మనం తినే ఆహారాన్ని జీర్ణం చేయడంతో పాటు శరీరానికి అవసరమైన పోషకాలన్ని అందిస్తుంది గట్. అంతేకాకుండా వ్యర్థ మలిన పదార్థాల్ని కూడా బయటకు పంపిచేస్తుంది. పేగులు ఆరోగ్యంగానే ఉంటేనే ఓ వ్యక్తి ఎలాంటి సమస్య లేకుండా ఉంటాడు. పేగులు అనారోగ్యంగా ఉంటే జీర్ణక్రియ సమస్యలు ఎదురయ్యే ప్రమాదముంది. దీంతో కడుపు సమస్యలతో పాటు ఇమ్యూనిటీ పవర్ కూడా తగ్గుతుంది.అంతేకాకుండా అన్ హెల్తీ గట్ కారణంగా పెద్ద పేగుల్లో వాపు, ఎండో క్రైన్ సమస్యలు, క్యాన్సర్ వంటి వ్యాధుల బారిన పడే ప్రమాదముంది. అందుకే జీర్ణక్రియ సాఫీగా జరగాలంటే సరైన ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడంతో పాటు తగినంత నీరు తీసుకోవడం చాలా అవసరం. అంతేకాకుండా కొన్ని ఇంటి నివారణలతో పొట్టను శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. ముఖ్యంగా రాత్రి పడుకునే ముందు కొన్ని ఇంటి చిట్కాలు ఫాలో అయితే పేగుల్ని క్లీన్ చేసుకోవచ్చు. ఆ చిట్కాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.

### గోరువెచ్చని నీరు తాగడం..



రాత్రి పడుకునే ముందు ఒక గ్లాసు గోరువెచ్చని నీరు తాగడం వల్ల పొట్ట శుభ్రంగా ఉంటుంది. గోరువెచ్చని నీరు జీర్ణక్రియ ప్రక్రియను మెరుగుపరుస్తుంది. శరీరం నుంచి టాక్సిన్స్ను బయటకు పంపడంలో సహాయపడుతుంది. కడుపులో గ్యాస్, మలబద్ధకం, అసిడిటీ వంటి సమస్యలను కూడా దూరం చేస్తుంది. పేగులు ఆరోగ్యంగా ఉండటం కోసం రోజూ రాత్రి పూట గోరువెచ్చని నీరు తాగాలని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

### ఉసిరి, తేనె కలిపి వాడండి..



ఉసిరి విటమిన్ సి యొక్క అద్భుతమైన మూలం. ఉసిరిలో ఎన్నో పోషకాలు ఉంటాయి. అంతేకాకుండా ఇందులో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. పొట్టను క్లీన్ చేసే యాంటీ ఆక్సిడెంట్లు ఉసిరిలో ఉన్నాయి. ఇవన్నీ పొట్టను క్లియర్ చేయడంలో సాయపడతాయి. ఇందుకోసం ఒక చెంచా ఉసిరి పొడితో ఒక స్పూన్ తేనె కలిపి.. రాత్రి పడుకునే ముందు తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఇది శరీరం నుంచి వ్యర్థ పదార్థాల్ని తొలగిస్తుంది. దీంతో... పేగులు ఆరోగ్యంగా ఉంటాయి.

### జీలకర్ర, అల్లం వాటర్..



జీలకర్ర, అల్లంలో జీర్ణక్రియని వేగవంతం చేసే ఎంజైములు ఉంటాయి. వీటి మిశ్రమం కడుపుని క్లియర్ చేయడం సాయపడుతుంది. ఇందుకోసం ఒక గ్లాస్ నీరు తీసుకోండి. ఈ నీటిని వేడి చేయాలి. ఇందులో అర టీ స్పూన్ జీలకర్ర, అర టీ స్పూన్ ఎండు అల్లం వేసి మరిగించండి. నీరు సగం వచ్చిన తర్వాత.. ఫిల్టర్ చేసి గోరు వెచ్చగా రాత్రి పడుకునే ముందు తాగండి. ఈ నీటిని తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడి.. పొట్ట శుభ్రంగా ఉంటుంది. జీలకర్ర, పొడి అల్లం కలిపిన నీటిని తాగడం వల్ల శరీరంలో మంట తగ్గుతుంది. ఇది శరీరానికి అనేక ఇతర ప్రయోజనాల్ని అందిస్తుంది.

### పండ్లు, కూరగాయలు..



పేగుల్ని, పొట్టను శుభ్రంగా ఉంచుకోవడానికి తాజా పండ్లు, కూరగాయల్ని ఆహారంలో భాగం చేసుకోవాలి. పండ్లు, కూరగాయల్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఫైబర్ కడుపుని శుభ్రపరుస్తుంది. మలబద్ధక సమస్యల్ని తొలగిస్తుంది. రాత్రి పడుకునే ముందు యాపిల్ లేదా అరటి పండు వంటిని తినండి. ఎక్కువ మోతాదులో కాకుండా ఒకటి తినేలా ప్లాన్ చేసుకోండి. వీటితో పాటు కూరగాయల సలాడ్ తీసుకోవడానికి ప్రయత్నించండి. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. పొట్టను శుభ్రపర్చడంలో సహాయపడుతుంది

### మజ్జిగ..



మజ్జిగలో ప్రోబయోటిక్స్ ఉంటాయి. ఇవి కడుపులో బ్యాక్టీరియా సమతుల్యతను కాపాడుకోవడానికి సహాయపడతాయి. మజ్జిగ కడుపుని చల్లబరుస్తుంది. పేగుల్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. మజ్జిగ జీర్ణ ఎంజైమ్లను క్రమబద్ధీకరిస్తుంది. రోజూ మజ్జిగ తాగడం వల్ల పేగులు క్లీన్ అవుతాయని నిపుణుల అభిప్రాయపడుతున్నారు. కొంచెం జీలకర్ర కలిపిన మజ్జిగను రోజూ రాత్రి పడుకునేముందు తాగితే.. ఉదయాన్నే కడుపు క్లీన్ అవుతుందని ఆయుర్వేద నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ సహజ పద్ధతులు పొట్టని క్లీన్ చేయడంలో సమర్థవంతంగా పనిచేస్తాయని నిపుణులు అంటున్నారు.

**గమనిక..**

ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.